# అక్రమాల్లో మీది గిన్నిస్ రికార్డు



## అవినీతిపై యుద్ధం మీ నుంచే మొదలు కావాలి
## హైకోర్టు జడ్జితో విచారణకు ఒప్పుకోండి
## అందుకు వీలుగా.. పదవి నుంచి తప్పుకోండి
## ముఖ్యమంత్రి వైఎస్‌పై మైసూరా ధ్వజం

**"రాష్ట్రంలో అవినీతికి ఆద్యుడు మీరే. అలాంటి మీరు అవినీతిపై యుద్ధం ప్రకటించడం ఆశ్చర్యంగా ఉంది. అవినీతిపై పోరాటాన్ని మీ నుంచే మొదలెట్టండి. నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే.. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అక్రమాలు, మీ మీద వచ్చిన ఆరోపణలపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించండి. అలా చేయాలంటే.. మీరు పదవి నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది. మీకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా... రాజీనామా చేసి, విచారణకు ఒప్పుకోవడం మేలు"**

– వైఎస్‌కు మైసూరా సూచన

హైదరాబాద్, న్యూస్‌టుడే: సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడం చేతగాక... ముఖ్యమంత్రి వైఎస్ తెదేపాపై నిందలేస్తున్నారని ఆ పార్టీ నేత ఎం.వి.మైసూరారెడ్డి ధ్వజమెత్తారు. ప్రాజెక్టులకు తెదేపా అడ్డమంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. మైసూరా గురువారమిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీటిప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆపడం తెదేపా తరం కాదంటూ వైఎస్ తాజాగా చేసిన వ్యాఖ్యలను మైసూరా తప్పుపట్టారు. నిజానికి వాటిని నిర్మించడం వైఎస్ తరమే కావడం లేదన్నారు. "మీరు అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయింది. రెండేళ్లలో పూర్తిచేస్తామన్న ప్రాజెక్టులనే ఇంతవరకూ పూర్తి చేయలేదు. ఇక ఐదేళ్ల కాలపరిమితి పథకాల సంగతి చెప్పనవసరం లేదు. ఇలా మీరు చేతులెత్తేసి... ప్రజలను మభ్యపెట్టేందుకు కుంటిసాకులు వెదుకుతున్నారు. తెదేపా అడ్డమంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. సాగునీటి పథకాలను మేం ఎన్నడైనా వద్దన్నామా? ఆ దిశగా కోర్టుల్లో ఒక్క పిటిషనైనా వేశామా? మీరే తుమ్మి, మీరే తథాస్తు అనుకున్నట్లుగా ఉంది మీ వ్యవహారం" అని వైఎస్‌ను నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చి, పూర్తిచేస్తామని మైసూరా చెప్పారు. ప్రపంచంలోనే అవినీతి సామ్రాట్‌గా ఈ ప్రభుత్వానికి గుర్తింపు వచ్చిందని మైసూరా ఎద్దేవా చేశారు. అవినీతిలో వైఎస్ గిన్నిస్‌బుక్ ఎక్కారన్నారు. "సినీ పరిభాషలో చెప్పాలంటే అవినీతి పరంగా వైఎస్ బాక్సాఫీస్ బద్దలు కొట్టారు. ఇంత అవినీతి సామ్రాట్ చరిత్రలో ఎక్కడా ఉండరు. అవినీతిలో ఆయన గంతుల ముందు... ఆంజనేయుడి కుప్పిగంతులు సైతం దిగదుడుపు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల అవినీతిపై విచారణ జరిపి, వైఎస్‌ను దోషిగా నిలబెడతాం" అని మైసూరా ఉద్ఘాటించారు. "ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించిన వారందరిపై ఆరోపణలు చేయడం, ఎదురుదాడి చేయడం మీకు రివాజుగా మారింది. మీరు అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయింది. నాలుగేళ్లుగా అవే ఆరోపణలనే పదే పదే చేస్తున్నారు. నాగంపై మీరు చేసే ఆరోపణల్లో పస ఉంటే... విచారణ జరిపించి, ఆయన్ని ఉరి తీయండి. అంతేగానీ తప్పుడు ఆరోపణలెందుకు? విచారణ జరిపించే సత్తాలేని నపుంసక ప్రభుత్వమా మీది? " అని చిన్నారెడ్డిపై మండిపడ్డారు.